క్లుప్తంగా

వెలుగు కార్యాలయంలో తనిఖీలు



పెనుగంచిప్రోలు: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నందిగామ ఏసీ సహాయదాసు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆయా గ్రామాల్లో పలువురు వీఓఏలు బినామీ పేర్లతో కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. మండలంలో 41వీఓఏలపై విచారణ చేస్తున్నామని, అవకతవకలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరునికి పుష్పయాగం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): కార్తికమాసం పురస్కరించుకుని తిరుమలగిరిలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి పుష్పయాగం, అభిషేకాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధరకాల పూలు, లక్ష తులసీదళాలతో మూలవిరాట్‌కు పూజలు చేశారు. హోమశాలలో పుష్పయాగం, పూర్ణాహుతి నిర్వహించారు. లోక కళ్యాణార్థం ఈ పూజ నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో వరప్రసాద్, వేదాద్రి ఈవో సురేష్‌బాబు, ఆలయ చైర్మన్ భరద్వాజ్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

వీరులపాడు: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో అరుంధతీదేవి సూచించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆమె మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు.

పెన్షనర్ల సమావేశం



కంచికచర్ల: స్థానిక పెన్షనర్ల సంఘ కార్యాలయంలో బుధవారం విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్స్ తమ కమ్యుటేషన్ రికవరి పిరియడ్ 15ఏళ్లు కాకుండా ప్రస్తుత గణాంకాల ప్రకారం 11ఏళ్ల మూడు నెలలతో పూర్తవుతుందన్నారు. దీని కారణంగా కమ్యుటేషన్ తీసుకుని 135 నెలలు పూర్తి చేసుకున్న పెన్షనర్లందరికీ లబ్ధి చేకూరుతుందని వివరించారు. 2010 ఫిబ్రవరి 10నుంచి 2014లోపల రిటైర్డ్ అయిన పెన్షనర్లంతా ప్రస్తుతం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి నాగేశ్వరరావు, బీవీ సర్వేశ్వరరావు, బి మల్లిఖార్జునరావు, చాపలమడుగు స్వర్ణలత, కేవీ రమణమూర్తి జాన్‌మియా తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష దీపోత్సవం



నందిగామటౌన్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన లక్ష దీపోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పరమేశ్వరునికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, పుష్పార్చన అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో హరిగోపీనాథ్ తగిన ఏర్పాట్లు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

అలరించిన వీణగాన కచేరి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం వీణగాన కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన అచలా శంకర్‌నాథ్ పలు కీర్తనలకు వీణపై చక్కగా పలికించగా, మృదంగంపై విద్యాసాగర్, ఘటంపై శ్రీధర్ ఆచార్య చక్కటి సహకారం అందించారు. అనంతరం వీణ కచేరి నిర్వహించిన బృందానికి ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



భీమవరం రైల్వేట్రాక్ సమీపంలో రోడ్డు పరిస్థితి ఇలా



కుంగిన లింగాల-ఆళ్లూరుపాడు రోడ్డు





పెనుగంచిప్రోలు గ్రామ శివారులో దెబ్బతిన్న రోడ్డు

మక్కపేట ఆంజనేయస్వామి గుడి వద్ద

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఆంధ్రప్రదేశ్‌ను గోతులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామంటూ హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరునెలలైనా రోడ్లు మాత్రం మరమ్మతులకు నోచుకోలేదు. ఇందుకు వత్సవాయి మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లే నిదర్శనం. గుంతలు, గోతులమయమైన ఈ రోడ్ల కారణంగా వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతూ అవస్థలుపడుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –వత్సవాయి



చిల్లకల్లు-వైరా రోడ్డులో లింగాల మునేటికాలువ వద్ద రోడ్డు పరిస్థితి ఇది



గుంతలమయమైన తిరుమలగిరి చిల్లకల్లు రోడ్డు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



ఆకుకూరల సాగును పరిశీలిస్తున్న సీడీపీఓ లక్ష్మీభార్గవి

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పెరటి తోటలు పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి సూచించారు. మండలంలోని ముండ్లపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన పోషణ వాటికను పరిశీలించారు. ఈసందర్భంగా లక్ష్మీభార్గవి మాట్లాడుతూ శాశ్వత భవనం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఎటువంటి రసాయనాలు వాడని ఆకుకూరలు, కూరగాయలు పెంచాలని సూచించాచరు. తద్వారా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గుంటుపల్లి ధనలక్ష్మి, ఆయా కొత్తపల్లి సుగుణకుమారి పాల్గొన్నారు.

నేడు అమ్మవారి శాంతి కల్యాణం

పెనుగంచిప్రోలు: హిందూ ధర్మప్రచారంలో భాగంగా కార్తికమాసం, కోటి దీపోత్సవాన్ని పురస్కరించుకుని నందిగామ కేవీఆర్ కళాశాల ప్రాంగణంలో గురువారం రాత్రి 7 గంటలకు పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం తరపున నిర్వహిస్తున్న ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



మాట్లాడుతున్న జగ్గయ్యపేట జడ్జి శ్రావణి, వేదికపై జడ్జి శోభారాణి, అన్నెపాగ సుందరరావు



సదస్సుకు హాజరైన విజ్ఞాన్ విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: బాల్యవివాహాలు అనేక అనర్థాలకు దారితీస్తాయని జగ్గయ్యపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి పేర్కొన్నారు. స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'బాల్య వివాహాలు రద్దు–భారతదేశం' అనే అంశంపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి కె.శ్రావణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు పాఠశాల యాజమాన్యాలకు, సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందన్నారు. బాల్యవివాహాలు జరిపించే తల్లిదండ్రులతోపాటు పురోహితునిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురికాకుండా బాలికలు తమనుతాము కాపాడుకునేందుకు పాటించాల్సిన అంశాలపై వారికి అవగాహన కలిగించారు. ఫోక్స్ చట్టాన్ని వివరించారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, మాజీ బార్ అధ్యక్షుడు పి.సత్యశ్రీనివాసరావు, స్కూల్ ప్రిన్సిపాల్ తస్నీరు సుధారాణి, న్యాయవాదులు బూడిద నరసింహారావు, మెట్టిల ఆంజనేయులు, దేసింగ్ రాజు, లీగల్ సర్వీసెస్ న్యాయవాది దాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నందిగామలో..



మాట్లాడుతున్న నందిగామ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం

నందిగామటౌన్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి బాల్య వివాహాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని నందిగామ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం హెచ్చరించారు. బాలవివాహ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం బాల్య వివాహాల నియంత్రణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ బాల్య వివాహాలకు పాల్పడితే బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాల కారణంగా ఎన్నో అనర్థాలు ఉత్పన్నమవుతాయన్నారు. వాటి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాలికలంతా చక్కగా చదువుకుని ఆయారంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబూ విద్యాసాగర్, కార్యదర్శి అద్దంకి మణిబాబు, ఎక్కిరాల హనుమంతరావు, ఆజాద్, మాలేశ్వరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ బాలకృష్ణ

కంచికచర్ల: పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమంతోపాటు డ్రగ్స్ నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం వంటిదని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడంతోపాటు ఎన్నికల సమయంతో తప్పకుండా ఓటుహక్కును వినియోగించుకోవాని సూచించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. నందిగామ ఎక్సైజ్ సీఐ షేక్ అఫ్రపున్నీసా బేగం మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలకు అలవాటుపడితే జీవితంలో ఎంతో నష్టపోతారని హెచ్చరించారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితం అందిపుచ్చుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.జాహ్నవి, కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: ఏడీఏ



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ భవాని

జగ్గయ్యపేట: రైతులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ భవాని సూచించారు. మండలంలోని గౌరవరం, బండిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వం గ్రేడ్-ఎ ధాన్యం క్వింటాకు రూ.2320, సాధారణ రకం రూ.2300లకు కొనుగోలు చేస్తోందన్నారు. గోనెసంచులు, హమాలీలు రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. రబీ 2024-25 సంవత్సరానికి సంబంధించి రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు.

పంటల బీమాకు సంబంధించి రైతులు వారి పంటలకు వారే ప్రీమియం కట్టుకోవాలని సూచించారు. అనంతరం వరి ధాన్యం కల్లాలను పరిశీలించారు. ముఖ్యంగా జిల్లాలో ఈనెల 29, 30వ తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను సూచించారు. ఏడీఏ వెంట ఏవో వరలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా

- తెలంగాణా జిల్లాలకు తరలింపు
- చోద్యంచూస్తున్న అధికారులు



బండిపాలెం నుంచి అక్రమంగా లారీలో తరలివెళ్తున్న గ్రావెల్

జగ్గయ్యపేట: మండలంలో గ్రావెల్ అక్రమ రవాణా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు. ముఖ్యంగా అన్నవరం, బలుసుపాడు, అనుమంచిపల్లి, వేదాద్రి, గండబోయినపాలెం, బండిపాలెం, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల నుంచి గ్రావెల్‌ను లారీలు, టిప్పర్లతో తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రొక్లెయిన్‌లను ఏర్పాటు చేసి మరీ గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. జగ్గయ్యపేటకు పక్కనే ఉన్న ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో రహదారుల పనులు జరుగుతుండటంతో అక్రమార్కులు ఈ ప్రాంతంలోని గ్రావెల్‌పై కన్నేశారు. ఆయా గ్రామాల్లోని కొందరు వ్యక్తుల ద్వారా ట్రాక్టర్లతో గ్రావెల్‌ను రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రక్కు ధర రూ.2000 నుంచి రూ.5000ల వరకు విక్రయిస్తున్నారు. కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూముల్లో ప్రొక్లెయిన్‌లను ఏర్పాటు చేసి 20నుంచి 30అడుగుల మేర గుంతలు తవ్వి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు సైతం చోద్యం చూస్తుండటంతో అక్రమార్కుల వ్యాపారం మూడు ట్రాక్టర్లు..ఆరు లారీల్లా సాగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమరవాణాను అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతకు అభినందనలు



జగ్గయ్యపేటఅర్బన్: చెరువుబజారుకు చెందిన ముద్దా తిరుపతమ్మ ఇటీవల తమిళనాడులోని సేలంలో నిర్వహించిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 63 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఓవరాల్ స్ట్రాంగ్ ఉమెన్‌గా నిలిచింది. ఈసందర్భంగా బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తననివాసంలో ముద్దా తిరుపతమ్మను అభినందించారు. తాళ్లూరి వెంకటేశ్వర్లు, గుడిసె నాగేశ్వరరావు, గాలం శ్రీను, కార్తీక్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన



సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న దంపతులు

నందిగామటౌన్: మండలంలోని పల్లగిరి సమీపంలో ఉన్న చల్లా సంగమేశ్వరరావు మామిడి తోటలో బుధవారం బాలభక్త సమాజం ఆధ్వర్యంలో ఆర్య వైశ్య కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మహిళలు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు దంపతులు పీటలపై కూర్చుని సామూహిక సత్యనారాయణ స్వామివారి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం మహిళలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మాట్లాడుతూ కార్తిక వన సమారాధనలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. బాలభక్త సమాజం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించి రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆర్యవైశ్యులను ఒకచోట కలపడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన



కల్లంలో ధాన్యం కాటా వేస్తున్న రైతులు



యంత్రం సాయంతో సాగుతున్న వరికోతలు



తరలింపునకు సిద్ధంగా ఉన్న గడ్డికట్టలు

పెనుగంచిప్రోలు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరిసాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన వరి పంటను కోయాలా?వద్దా అనే సందిగ్ధంలో పడిపోయారు. పంట పూర్తిగా చేతికొచ్చిన సమయంలో కోతలు చేపట్టకుండా వదిలేస్తే వర్షాలకు మరింత దెబ్బతింటామని భావిస్తూ కొందరు రైతులు యంత్రాల సాయంలో కోతలు మొదలుపెట్టారు. కల్లాల్లోనే ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకుంటున్నారు. గడ్డిని కూడా యంత్రాల సాయంతో కట్టలు కట్టించి ఇళ్లకు తరలిస్తున్నారు. పంట సమయం ఉన్న రైతులు కొద్దిరోజులపాటు వరికోతలను వాయిదా వేసుకోవాలని పెనుగంచిప్రోలు మండల వ్యవసాయాధికారి కె.రామసుబ్బారెడ్డి సూచించారు.